**04.06.2020**

**అమరావతి**

- **వైయస్సార్ వాహనమిత్ర రెండో ఏడాది చెల్లింపులు**
- **క్యాంప్ కార్యాలయంలో కంప్యూటర్‌లో బటన్ నొక్కి ఒకేసారి 2,62,493 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.262.49 కోట్లు జమ చేసిన సీఎం.**
- **కరోనా లాక్‌డౌన్ నేపథ్యంలో ఆర్థికంగా నష్టపోయిన ఆటో, క్యాబ్‌లు, మాక్సీ క్యాబ్‌ల డ్రైవర్లను ఆర్థికంగా ఆదుకునేందుకు నాలుగు నెలల ముందుగానే పథకం అమలు.**
- **మీ అన్నగా, మీ తమ్ముడిగా ఈ సహాయం చేస్తున్నాను**
- **మీ అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నాను**
- **ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్ వెల్లడి**
- **వైయస్సార్ వాహనమిత్ర పథకం రెండో ఏడాది అమలు**
- **2.62 లక్షల మందికి రూ.262 కోట్ల ఆర్థిక సహాయం**
- **లాక్‌డౌన్ వల్ల ఇబ్బంది పడుతున్న వారిని ఆదుకోవడం కోసం 4 నెలల ముందే పథకం అమలు**
- **పథకం అమలులో పూర్తి పారదర్శకత**
- **ఎక్కడా అవినీతికి తావు లేకుండా పథకం**
- **అర్హులెవరైనా మిగిలిపోతే గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోండి**
- **లేదా స్పందన యాప్ ద్వారా దరఖాస్తు చేయండి**
- **వచ్చే నెల 4వ తేదీన సహాయం అందిస్తాం: సీఎం**

అమరావతి: ఒక అన్నగా, ఒక తమ్ముడిగా ఆటో డ్రైవర్లు, టాక్సీలు, మాక్సీ క్యాబ్‌ల డ్రైవర్లకు ఆర్థిక సహాయం చేస్తున్నామని, అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నానని ముఖ్యమంత్రి శ్రీ వైయస్ జగన్ వెల్లడించారు. లాక్‌డౌన్ వల్ల ఇబ్బంది పడుతున్న వారిని ఆదుకోవడం కోసం 4 నెలల ముందే పథకం అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. పథకం అమలులో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని, ఎక్కడా అవినీతికి తావు లేకుండా పథకం అమలు చేస్తున్నామని చెప్పారు. ఇంకా అర్హులెవరైనా మిగిలిపోతే గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని లేదా లేదా స్పందన యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, ఇంకా ఏమైనా ఇబ్బంది ఉంటే స్పందన హెల్ప్‌లైన్ నెంబరు 1902కు కాల్ చేయాలని సూచించారు. అలా దరఖాస్తు చేసుకున్న వారికి అర్హత ఉంటే వచ్చే నెల 4వ తేదీన ఆర్థిక సహాయం చేస్తామని సీఎం ప్రకటించారు.

సొంతంగా ఆటోలు, టాక్సీలు, మాక్సీ క్యాబ్‌లు నడుపుకుంటున్న డ్రైవర్లకు ఇన్సూరెన్సు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ) కోసం సహాయం చేస్తూ రూ.10 వేలు ఇస్తున్న వైయస్సార్ వాహనమిత్ర పథకంలో వరసగా రెండో ఏడాది ఆర్థిక సహాయాన్ని సీఎం శ్రీ వైయస్ జగన్ గురువారం అందించారు. రాష్ట్రవ్యాప్తంగా 2,62,493 మంది లబ్ధిదారులకు రూ.10 వేల చొప్పున వారి వారి ఖాతాల్లో ఒకేసారి రూ.262.49 కోట్లు జమ చేశారు.

క్యాంప్ కార్యాలయంలో కంప్యూటర్‌లో సీఎం శ్రీ వైయస్ జగన్ బటన్ నొక్కిన వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో ఆ మొత్తం జమ అయింది. బ్యాంకులు పాత అప్పుల కింద ఆ మొత్తం జమ చేసుకోకుండా, అన్ ఇన్‌కమ్‌బర్డ్ ఖాతాల్లో వేశారు. గత ఏడాది కంటే ఈ సంవత్సరం కొత్తగా 37,756 మంది ఈ పథకంలో లబ్ధిదారులయ్యారు.

## వీడియో ప్రదర్శన

కార్యక్రమం ప్రారంభంలో వైయస్సార్ వాహనమిత్ర పథకానికి సంబంధించిన వీడియోను ప్రదర్శించారు. గత ఏడాది వాహనమిత్ర పథకం ప్రారంభం సందర్భంగా సీఎం శ్రీ వైయస్ జగన్ ప్రసంగంతో పాటు, రెండో ఏడాది 4 నెలల ముందుగానే అమలు చేయడం, ఆటో డ్రైవర్ల స్పందనతో వీడియో ప్రదర్శించారు.

## నాలుగు నెలలు ముందుగానే:

ఆటో, టాక్సీ, మాక్సీ క్యాబ్ సొంతంగా కొని బతుకుతున్న అన్నదమ్ములకు మంచి జరగాలని కోరుకుంటున్నానన్న సీఎం శ్రీ వైయస్ జగన్, గత ఏడాది అక్టోబరు 4న వైయస్సార్ వాహనమిత్ర పథకాన్ని ప్రారంభించినట్లు గుర్తు చేశారు. అయితే ఈ ఏడాది కోవిడ్‌తో లాక్‌డౌన్ వల్ల బతకడం కష్టమైందని, ఆటోలు, టాక్సీలు తిరగక ఆ కుటుంబాలు ఇబ్బంది పడ్డాయి కాబట్టి వారికి మేలు చేయడం కోసం ఈ ఏడాది జూన్ 4నే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు.

## ఆలోచించాను. అమలు చేశాను:

‘2018 మే నెలలో ఏలూరులో పాదయాత్ర సందర్భంగా మాట ఇచ్చాను. ప్రతి జిల్లాలో ఆటో డ్రైవర్లు తమ సమస్యలు చెప్పుకున్నారు. ఇన్సూరెన్సు కట్టాలి. అది కడితేనే ఎఫ్‌సీ ఇస్తారు. బీమా ప్రీమియమ్ ఎక్కువ కావడంతో, డ్రైవర్లు చాలా ఇబ్బంది పడే వారు. ఎఫ్‌సీ లేకపోతే రోజుకు రూ.50 జరిమానా విధించే వారు. అప్పుడు దాదాపు అన్ని జిల్లాలలో డ్రైవర్లు వచ్చి నన్ను కలిశారు. ఎఫ్‌సీ కోసం ఒకేసారి దాదాపు రూ.10 వేల ఖర్చు చేయాల్సి రావడం, ఆ తర్వాత రోజుకు రూ.50 ఫైన్ ఎలా కడతారని ఆలోచించి, ఏలూరు సభలో మాట ఇచ్చాను.

అధికారంలోకి వచ్చాక అమలు చేశాను. ఈసారి మళ్లీ మీ తమ్ముడిగా, అన్నగా సహాయం చేస్తున్నాను' అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**పాత బాకీల కింద పోకుండా:**

గత ఏడాది ఆటోలు, టాక్సీలు, మాక్సీ క్యాబ్‌ల డ్రైవర్ల ఖాతాలో నగదు వేస్తున్నప్పుడు, దాన్ని పాత అప్పుల కింద జమ చేసుకోకుండా అన్ ఇన్‌కమ్‌బర్డ్ ఖాతాల్లో వేశామని సీఎం చెప్పారు. అప్పుడు దాదాపు రూ.236 కోట్లు ఖర్చు చేయగా, ఈసారి ఆ అన్నదమ్ముల కోసం రూ.262 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నామని తెలిపారు. గత ఏడాది కంటే ఈసారి 37,756 మంది కొత్త లబ్ధిదారులు చేరారని చెప్పారు.

**క్యాలెండర్ ప్రకారం!:**

అన్ని వర్గాలకు సేవలందించే విధంగా క్యాలెండర్ ప్రకటించామన్న ముఖ్యమంత్రి, అందులో భాగంగా ఇవాళ (గురువారం) ఈ కార్యక్రమం అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. ఈనెల 10వ తేదీన రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లకు సహాయం అందిస్తామని, ఆ తర్వాత 17న నేతన్న నేస్తం. 24న కాపు నేస్తం. 29న ఎంఎస్ఎంఈలకు రెండో విడత లబ్ధి ఇస్తామని చెప్పారు.

**అన్ని వర్గాల వారికి న్యాయం:**

పేదలకు న్యాయం చేస్తేనే రాష్ట్రం, దేశానికి చాలా మంచిదని, ఇప్పుడు లబ్ధి పొందుతున్న వారిలో కూడా అన్ని వర్గాల వారు ఉన్నారని తెలిపారు.

ఎస్సీలు 61,390 మంది, ఎస్టీలు 10,049 మంది, బీసీలు 1,17,096 మంది, ఈబీసీలు 14,590 మంది, మైనారిటీలు 28,118 మంది, కాపులు 29,643 మంది, బ్రాహ్మణులు 581 మంది ఉండగా, క్రైస్తవులు 1026 మంది ఉన్నారని, అందరూ కలిపి మొత్తం 2,62,493 మందికి ఈ ఏడాది వైయస్సార్ వాహనమిత్ర పథకంలో లబ్ధి చేకూరుస్తున్నామని వివరించారు.

**అర్హులైన ప్రతి ఒక్కరికి:**

ఎక్కడైనా ఎవరికైనా అర్హత ఉండి ఈ పథకంలో లబ్ధి రాకపోతే ఆందోళన చెందవద్దని సీఎం తెలిపారు. తనకు ఓటు వేయకపోయినా సరే, అర్హులైతే చాలు పథకం వర్తింప చేయాలని స్పష్టం చేశారు. కాబట్టి ఎక్కడైనా, ఎవరైనా మిగిలిపోతే వారు వార్డు, గ్రామ సచివాలయానికి వెళ్లి, పథకం అర్హతల గురించి తెలుసుకోవాలని, అర్హులైతే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వారికి అర్హత ఉంటే వచ్చే నెల 4న సహాయం చేస్తామని చెప్పారు.

గ్రామ, వార్డు సచివాలయానికి వెళ్లలేకపోతే, స్పందన వెబ్‌సైట్‌లో రిజస్టర్ చేసుకోవాలని, ఇంకా ఏమైనా సమస్యలు, సందేహాలు ఉంటే స్పందన హెల్ప్‌లైన్ 1902కు కాల్ చేయాలని సూచించారు. దరఖాస్తుదారులలో అర్హులైన వారికి వచ్చే నెల 4న ఆర్థిక సహాయం చేస్తామని ముఖ్యమంత్రి చెప్పారు.

**పూర్తి పారదర్శకత:**

ఎక్కడా అవినీతికి తావు లేకుండా, పూర్తి పారదర్శకతతో పథకం అమలు చేస్తామని సీఎం స్పష్టం చేశారు. పథకంలో ప్రయోజనం పొందుతున్న వారు ఆ మొత్తాన్ని వాహనం ఇన్సూరెన్సు, ఎఫ్‌సీ కోసం ఖర్చు చేయాలని సూచించారు.

‘ఎందుకంటే ప్రయాణికులు మిమ్మల్ని నమ్మి వాహనం ఎక్కుతారు. కాబట్టి మద్యం సేవించి వాహనం నడపకండి. నియమాలు పాటించండి.

మీ అందరికీ మంచి జరగాలని ఆకాంక్షిస్తున్నాను. మీ స్పందన తెలియజేయండి’ అంటూ సీఎం శ్రీ వైయస్ జగన్ తన ప్రసంగం ముగించారు.

## గత ఏడాది ఎంత మంది?

వైయస్సార్ వాహనమిత్ర పథకంలో గత ఏడాది 2,36,334 మందికి లబ్ధి చేకూర్చగా, వారిలో 11,595 మంది వాహనాలు అమ్ముకున్నారని రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటి కృష్ణబాబు వెల్లడించారు. దీంతో వారు అనర్హులు కాగా, గత ఏడాది లబ్ధి పొందిన వారిలో 2,24,739 మందిని అర్హులుగా గుర్తించామని తెలిపారు.

కాగా, ఈ ఏడాది 38,605 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 849 మందిని అనర్హులుగా తేలారని చెప్పారు. మిగిలిన 37,756 మందిని అర్హులుగా గుర్తించామని, దీంతో ఈ ఏడాది మొత్తం లబ్ధిదారుల సంఖ్య 2,62,493 కు చేరిందని కృష్ణబాబు వెల్లడించారు.

## వారు కోరకపోయినా!:

నిజానికి ఆటో డ్రైవర్లు, టాక్సీలు, మాక్సీ క్యాబ్‌ల డ్రైవర్లు కోరకపోయినా, సీఎం గారు చొరవ చూపి 4 నెలల ముందుగానే ఈ ఏడాది వైయస్సార్ వాహనమిత్ర పథకం అమలు చేశారని రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి చెప్పారు. గత ఏడాది అక్టోబరు 4న ఇచ్చారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

**ఆ 12,200 మందికి కూడా:**

గత ఏడాది 8600 మంది మైనారిటీ కార్పొరేషన్ లబ్ధిదారులు, మరో 3600 మంది బ్యాంక్ ఖాతాల వివరాలు సక్రమంగా లేకపోవడంతో వారికి ఆర్థిక సహాయం అందలేదని కృష్ణబాబు చెప్పారు. అందువల్ల ఆ 12,200 మందికి ఈ ఏడాది కూడా ఇస్తూ, రేపు (శుక్రవారం) సాయంత్రంలోగా గత ఏడాది మొత్తం కూడా జమ చేస్తున్నామని ఆయన వెల్లడించారు.

మంత్రులు పేర్ని నాని, అవంతి శ్రీనివాస్, సీఎస్ నీలం సాహ్ని, రవాణ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటి కృష్ణబాబు, ఆ శాఖ కమిషనర్ సీతారామాంజనేయులు, పలువురు అధికారులు, లబ్ధిదారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లాల నుంచి మంత్రులు, ప్రజా ప్రతినిధులు, కలెక్టర్లు, రవాణా శాఖ అధికారులు, పథకం లబ్ధిదారులు పలువురు ఈ కార్యక్రమానికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.